క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్‌కు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం ఆది, సోమవారాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఆదివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వేంకటేశ్వర మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్, శ్యామల నగర్, గాంధీపురం, పాత సోమాలమ్మ గుడి వీధి, రహమత్ నగర్, బొల్లినేని హాస్పిటల్ రోడ్డులో విద్యుత్ ఉండదు.
- సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ వెంకటేశ్వర నగర్ ఏరియా, గోలి రామారావు వీధి, వాకర్స్ పార్క్ రోడ్డు, మహాలక్ష్మి దేవాలయం రోడ్డు, సత్యవతి హోటల్ రోడ్డు, జేఎన్ రోడ్డు, చెరుకూరి ఫంక్షన్ హాలు రోడ్డు, సూర్య ఫంక్షన్ హాలు, మహాలక్ష్మి గుడి వీధులు, వేంకటేశ్వర నగర్, హ్యాపీ స్ట్రీట్, వాకర్స్ రోడ్డు, ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తారు.

ఏపీ ట్రాన్స్‌కో జట్టు కెప్టెన్‌గా అడబాల శ్రీరామకృష్ణ



కడియం: ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కం క్రికెట్ జట్లకు కెప్టెన్‌గా తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం దుళ్ల గ్రామంలో విద్యుత్ శాఖ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న అడబాల శ్రీరామకృష్ణ ఎంపికయ్యారు. ఈ మేరకు ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ నుంచి తనకు ఉత్తర్వులు అందాయని రామకృష్ణ శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. మొత్తం 20 మంది జట్టు సభ్యులను ఎంపిక చేయగా, అందులో కెప్టెన్‌గా తాను, వైస్ కెప్టెన్‌గా విశాఖకు చెందిన టి. అభిషేక్ ఉన్నామన్నారు. ఆలమూరు మండలం చెముడులంక (గాంధీనగరం)కు చెందిన శ్రీరామకృష్ణ బాల్యం నుంచే క్రికెట్‌లో రాణించేవారు. లైన్‌మెన్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే క్రికెట్‌ను ప్రాక్టీస్ చేస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో తనదైన ప్రతిభను కనబరుస్తూ అనేక బహుమతులను అందుకున్నారు. ఇప్పుడు ఏకంగా రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఎంపికై అందరిని అభినందనలు పొందారు.

మొక్కలతో పర్యావరణ రక్షణ

కడియం: విద్యార్థులందరూ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సర్పంచ్ పాతశెట్టి రాంజీ, రెడ్ క్రాస్ అధికార ప్రతినిధి మహాలక్ష్మి రాంబాబు అన్నారు. కడియపులంక ప్రగతి విద్యా నికేతన్ ఆవరణలో బ్లూడే వేడుకలు శనివారం ఆ విద్యాసంస్థ కరస్పాండెంట్ యోహాను అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బోడపాటి రాజేశ్వరి, పాఠశాల డైరెక్టర్ ప్రదీప్, రెడ్ క్రాస్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాస్టర్స్ క్రికెట్ కప్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: క్రీడలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. రాజమహేంద్రవరం ఎస్వీ గ్రౌండ్స్‌లో ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న మాస్టర్స్ క్రికెట్ కప్ సీజన్ 1కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజమహేంద్రవరంలో ఆయన కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఆర్గనైజర్లు మూర్తి, మిథున్ మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే ఈ ట్వంటీ ట్వంటీ మాస్టర్స్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఎనిమిది జట్లు పాల్గొంటున్నాయన్నారు.

బేడ (బుడ్గ) జంగాల పోరాటానికి మద్దతు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలోని బేడ (బుడ్గ) జంగాలకు ఎస్సీలకు ఉన్న ప్రయోజనాలు వర్తించేలా కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ బేడ(బుడ్గ)జంగం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కాతేరులోని వెంకటాద్రి గార్డెన్స్ ఫంక్షన్ హాలులో ఆత్మీయ సమ్మేళన సత్కార సభ నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పోరాట సమితి వ్యవస్థాపకుడు సిరిగిరి మన్యం అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడిన వక్తలు బేడ బుడ్గ జంగాలు ఎదుర్కొంటున్న సమస్యలను జవహర్ దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం జవహర్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం బేడ బుడ్గ జంగాలు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎలమర్తి మధు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు వీర్లపల్లి ఏసు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు మోటూరి సింహాచలం, కోనసీమ జిల్లా అధ్యక్షుడు పేర్ల దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగుల్లేని దీపాలు

- హండ్రెడ్ ఫీట్ రోడ్డులో అంధకారం
- పది రోజులుగా వెలగని వీధి దీపాలు
- రాత్రి సమయంలో రాకపోకలకు అవస్థలు



హండ్రెడ్ ఫీట్ రోడ్డులో వెలగని వీధి దీపాలు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని హండ్రెడ్ ఫీట్ రోడ్డులో పది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో ఆ ప్రాంతం అంధకారంగా మారింది. అటుగా వెళుతున్న వాహన చోదకులు, వాకర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కలెక్టర్ ఇన్‌చార్జి నగరపాలకసంస్థ కమిషనర్‌గా ఉన్నప్పటికీ వీధి దీపాల సమస్య పరిష్కారం కావడం లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు ఇవీ..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజల ఉపయోగార్థం హండ్రెడ్ ఫీట్ రోడ్డు నిర్మాణం చేపట్టి, అందుబాటులో తీసుకువచ్చారు. అప్పటి నుంచి రూరల్ గ్రామాల నుంచి ప్రజలు ఇటుగా నగరంలోకి రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి సమయంలో వీధి దీపాలు ఉండడంతో ప్రయాణం సక్రమంగా జరిగేది. అంతే కాకుండా పరిసర ప్రాంతాల ప్రజలు సాయంత్రం నుంచి రాత్రి ఏడు గంటల వరకూ ఈ రోడ్డు మీదే వాకింగ్ చేస్తున్నారు.

తరచూ మరమ్మతులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హండ్రెడ్ ఫీట్ రోడ్డులో వీధి దీపాలు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. గత పది రోజుల నుంచి అసలు వెలగడం లేదు. వెంకటేశ్వర జనరల్ మార్కెట్ నుంచి రాత్రి సమయంలో జట్టు కూలీలు, వర్కర్లు, షాపుల యజమానులు ఇదే రోడ్డులో ఇళ్లకు వెళతారు. రూరల్ పరిసర ప్రాంతాల ప్రజలు సైతం రాకపోకలు సాగిస్తుంటారు.

బిక్కుబిక్కుమంటూ..

హండ్రెడ్ ఫీట్‌రోడ్డులో రాత్రి సమయాల్లో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొందని వాహన చోదకులు వాపోతున్నారు. పది రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. నగరపాలకసంస్థ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకు వెళ్లినా పరిష్కారం కావడం లేదన్నారు.

రెండు రోజుల్లో పరిష్కరిస్తాం

హండ్రెడ్ ఫీట్ రోడ్డులో వీధి దీపాలు సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తాం. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్య ఉండడం వల్ల వీధి దీపాలు వెలగడం లేదు. నగరపాలక సంస్థ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించాలి. నగరపాలకసంస్థ కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మెలో ఉండడం వలన కొంత జాప్యం జరిగింది. ఉద్యోగులు సమ్మె విరమించడంతో వీధి దీపాల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తాం.

– విమల, అసిస్టెంట్ ఇంజినీర్, నగరపాలకసంస్థ

వారిపై చర్యలు తీసుకునే వరకూ పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ కుమార్

సీటీఆర్ఐ: మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేశాడన్న కారణంతో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రాంబాబు జీవనాధారాన్ని పోగొట్టిన రాజానగరం మండల తహసీల్దార్ జీఎల్ఎస్ దేవి, ఆమెకు అండగా నిలిచిన సీఐ వీరయ్య గౌడ్‌పై చర్యలు తీసుకునే వరకూ పోరాటం సాగిస్తానని స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్) అధ్యక్షుడు బర్రే ఆనంద్ కుమార్ అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజానగరం మండలంలో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలకు తహసీల్దార్ అండగా ఉంటున్నారని, ఆమెకు మద్దతుగా సీఐ వీరయ్య గౌడ్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పల్లకడియం గ్రామంలో అక్రమంగా చెరువులు తవ్వుతూ, చెరువుగట్లపై ఉన్న చెట్లను సైతం పెకలించి, లక్షల క్యూబిక్కుల మట్టిని తరలిస్తున్నారన్నారు. ఈ విషయంపై గ్రామస్తుడైన ఇజ్జిన రాంబాబు, మరికొందరితో కలిసి మార్చిలో జిల్లా కలెక్టర్ ప్రశాంతికి ఫిర్యాదు చేశారన్నారు. అప్పటి నుంచి స్థానిక నాయకులను ఉపయోగించుకొని వారిపై దాడులకు పాల్పడడం ప్రారంభించారన్నారు. సమావేశంలో ఇజ్జిన రాంబాబు, భార్య శాంతిరత్న పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు మినిస్టీరియల్ అవార్డు



కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు గొప్ప గౌరవం దక్కింది. మినిస్టీరియల్ అవార్డు (రాష్ట్రస్థాయి) కేటగిరికి ఎంపికై గౌరవ ప్రదమైన మంత్రివర్గ పురస్కారం పొందనుంది. ఈ విషయాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలో జూలై 17న జరిగే కార్యక్రమంలో అవార్డు అందజేయనున్నారు. అవార్డును స్వీకరించేందుకు కేవలం ముగ్గురు ప్రతినిధులకు మాత్రమే వేదికపైకి అనుమతి ఇస్తారు. జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి ఈ పురస్కారాన్ని స్వీకరించనున్నారు. నగరపాలక సంస్థ చేపట్టిన అభివృద్ధి, ప్రజాసేవ కార్యక్రమాలకు ఈ గౌరవం లభించింది.

వెంకన్న ఆలయంలో కర్ణాటక మంత్రి పూజలు



కర్ణాటక మంత్రి మల్లికార్జున్‌ను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కడియం: కడియపులంక హరిహర మహా క్షేత్రం ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని కర్ణాటక రాష్ట్ర మైనింగ్, జియాలజీ, హార్టికల్చర్ శాఖల మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్ శనివారం సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ మార్గాని సత్యనారాయణ ఆధ్వర్యంలో మంత్రికి ఆలయ ప్రాంగణంలో ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం స్వామికి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రూప్ టెంపుల్స్‌గా వెలుగొందుతున్న అపర్ణ సమేత అనంతేశ్వరస్వామి, సాయిబాబా ఆలయాలను సందర్శించారు. కార్యక్రమంలో సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ సంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, మాజీ అధ్యక్షుడు మల్లు పోలరాజు, బీజేపీ మండల అధ్యక్షుడు బొరుసు సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ పంతం గణపతి పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



పూర్వ విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న మున్సిపల్ ఆర్డీ నరసింహారావు, రవికుమార్ తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్య ఒక్కటే మనిషిని ఉన్నత శిఖరాలకు చేర్చగలదని రాజమహేంద్రవరం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ సీహెచ్ నాగ నరసింహారావు అన్నారు. జేఎన్ రోడ్డులోని ఎస్వీ ఫంక్షన్ హాల్లో శ్రీగౌతమి విద్యాసంస్థలు శనివారం ప్రతిభ పురస్కార్ 2025 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగ నరసింహారావు జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగౌతమి విద్యాసంస్థల డైరెక్టర్ సుంకర రవికుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విజయం సాధించేలా తమ ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. లాజికల్ రీజనింగ్, కంప్యూటేషనల్ థింకింగ్, కాంపిటేటివ్ ఎప్రోచ్ వంటి నైపుణ్యాలపై ఎక్కువ తర్ఫీదు ఇస్తున్నామన్నారు. దీనివల్ల విద్యార్థులు నేషనల్ కాంపిటేటివ్ పరీక్షలలోఅత్యున్నత ర్యాంకులు సాధిస్తున్నారన్నారు.ప్రతిభ పురస్కార్ 2025 గ్రహీతలను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు. చీఫ్ మెంటర్ ఫర్ హారైజర్ ఫౌండేషన్, సెంటర్ హెడ్, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ లారెల్ హైగ్లోబల్ స్కూల్ బి.గురునాథ్ మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో చదువుకుంటే జీవితంలో తప్పక విజయం సాధిస్తారన్నారు. శ్రీగౌతమి పూర్వ విద్యార్థులు (ఎస్ఎస్‌సీ 2023 బ్యాచ్) ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీలలో సీట్లు సాధించిన విద్యార్థులకు, ఈ ఏడాది ఎస్ఎస్‌సీ, పాలిసెట్, ఏపీఆర్‌జేసీ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, ప్రముఖ రచయితల పుస్తకాల అందజేశారు. శ్రీగౌతమి ఫౌండర్, ప్రిన్సిపాల్‌గా పనిచేసి స్వర్గీయులైన అడుసుమిల్లి బాలాజీ జ్ఞాపకార్థం 'అడుసుమిల్లి బాలాజీ అవార్డు'ను ఐఐటీ టాపర్‌గా నిలిచిన ఎండీ యూసఫ్‌కు రూ.10 వేల చెక్కు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సుంకర రవికుమార్, సుంకర మల్లికార్జున్ పాల్గొన్నారు.

విద్యతో పాటు మానవతా విలువలు బోధించాలి



శిక్షణలో మాట్లాడుతున్న సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర విద్యా విభాగ సమన్వయకర్త మాధవి

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులకు చదువుతో పాటు మానవతా విలువలను బోధించాలని సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర విద్యా విభాగ సమన్వయకర్తలు టి.మధుసూదనరావు, ఆర్.మాధవి అన్నారు. రాజమహేంద్రవరం సత్యసాయి గురుకులంలో కరస్పాండెంట్ అయోధ్యుల శ్యామ సుందర్, ప్రిన్సిపాల్ కె.గురయ్య ఆధ్వర్యంలో శనివారం గురుకుల బాలవికాస్ గురువుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మధుసూదనరావు, మాధవి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ఆచరించే విధంగా కథలు, ఆధ్యాత్మిక ఆటలు, బాలవికాస్ తరగతులు ఉండాలన్నారు. మౌన సాధన, ప్రార్థనలు, భజనలు, సత్యసాయి సూక్తులను నిత్య జీవితానికి అన్వయిస్తూ, ఆలోచనాత్మకంగా, ఆకర్షణీయంగా విద్యాబోధన చేయాలన్నారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలను బోధించారు. కరస్పాండెంట్ శ్యామసుందర్ మాట్లాడుతూ పాఠశాలలో ప్రతి రోజు చివరి పిరియడ్‌ను బాల వికాస్ తరగతులు బోధించడానికి వినియోగిస్తామని, దీనికి గురువులంతా సిద్ధం కావాలన్నారు. సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు పాటిస్తూ, బాలవికాస్ తరగతులను గురువులు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర విషయ అవగాహన నిపుణులు డాక్టర్ డీఎస్‌డీ శ్యామల, సి.కిరణ్ కుమార్, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు కొఠారు బాలకృష్ణసాయి ప్రసంగించారు. కార్యక్రమంలో తేతలి సోమసుందరరెడ్డి, సేవాసంస్థల జిల్లా విభాగ సమన్వయకర్తలు ఎల్.శ్రీనివాసరాజు, ఎం.సాయి నిహారిక, జోనల్ కన్వీనర్లు త్రిమూర్తులు, విజయసాయి పాల్గొన్నారు.

లంకల్లో డ్రోన్లతో విస్తృత దాడులు



నిందితులతో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ, సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ చింతాడ లావణ్య ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాలు ఉపయోగించి గోదావరి లంకల్లోని సారా బట్టీలపై శనివారం దాడులు నిర్వహించారు. గోంగూర లంక, షూటింగ్ లంక, బ్రిడ్జిలంకల్లో జరిగిన ఈ దాడుల్లో రెండు కేసులు నమోదు చేసి, 3,400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 160 లీటర్ల సారా, పడవ, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తాడితోటకు చెందిన బండారు దుర్గా ప్రసాద్, వనం వెంకటేష్, వెంకటనగరానికి చెందిన గంగోతు బంగారు, ద్వారపూడికి చెందిన అయినవిల్లి స్వామిసాగర్, కోటిలింగాలపేటకు చెందిన తెలగంశెట్టి శ్రీనివాసరావును అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన సంజీవ నగర్‌కు చెందిన బుడగా దేవుడు, వెంకటనగరానికి చెందిన కంగ్రోతు వెంకన్నబాబు పరారీలో ఉన్నారని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ (ఇన్‌చార్జి నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్) పి.హనుశ్రీ, ఎస్సై ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గోతులను నిర్లక్ష్యంగా వదిలేస్తే చర్యలు



శ్రీను మృతదేహాన్ని సందర్శించిన కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం: జనావాసాలకు చేరువలో ప్రజాప్రయోజనార్థం తవ్వే గోతులను వెంటనే పూడ్చివేయాలని, లేకుంటే తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. దివాన్ చెరువు పంచాయతీ పరిధిలోని జంగాల కాలనీలో పంచాయతీ సిబ్బంది తవ్వి వదిలేయడంతో ఆ గోతిలోకి వర్షం నీరు చేరింది. ఆడుకుంటూ ప్రమాదశాత్తూ అందులో పడి కడమంచిలి శ్రీను అనే నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇటువంటి దుర్ఘటనలు మరెక్కడా జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆమె శుక్రవారం అర్ధరాత్రి సమయంలో దివాన్ చెరువులో బాలుడు మృతదేహాన్ని సందర్శించి, తల్లిదండ్రులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. జరిగిన సంఘటనపై తహసీల్దారు నుంచి నివేదికను కోరారు. ఈ దుర్ఘటనకు కారకులైన వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ వెంట రాజమహేంద్రవరం ఆర్డీఓ కృష్ణనాయక్, తహసీల్దారు జీఏఎస్ఎల్ దేవి ఉన్నారు.

పాలకులే రౌడీలకు ఆశ్రయం కల్పిస్తే ఎలా!

- కూటమి పాలనలో సామాన్యుడికి రక్షణ లేదు
- మాజీ హోం మంత్రి తానేటి వనిత
- బాధితురాలిని పరామర్శించిన వైఎస్సార్ సీపీ నాయకులు



ఆస్పత్రి వద్ద విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తానేటి వనిత, చెల్లుబోయిన వేణు, జక్కంపూడి రాజా, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: పాలకులే కుల వివక్ష చూపిస్తూ రౌడీలకు ఆశ్రయం కల్పిస్తే.. ఇక సామాన్యులకు రక్షణ ఎలా ఉంటుందని రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడి అనపర్తి ఏరియా ఆసుపత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతున్న దుప్పలపూడికి చెందిన దళిత మహిళ కొమ్ము బుజ్జిని శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. మాజీ మంత్రి వనితతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆస్పత్రికి వెళ్లారు. ప్రాణభయంతో వణికి పోతున్న బుజ్జి, ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

పెరిగిన దాడులు

మాజీ మంత్రి వనిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలపై దాడులు తీవ్రమయ్యాయన్నారు. అనపర్తి నియోజకవర్గంలో మరిన్ని ఎక్కువ జరుగుతున్నాయన్నారు. ప్రాణ రక్షణ కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేయడానికి స్టేషన్‌కు వెళ్లి వస్తున్న బాధితులపై, దారి కాచి, వీధి లైట్లు ఆర్పివేసి హత్యాయత్నం చేసిన నల్లమిల్లి వెంకట రామారెడ్డి (ఎన్వీ)కి పోలీసులు సహకరిస్తున్నారన్నారు. నిందితులు స్టేషన్ బెయిల్‌పై బయటకు వచ్చి, గ్రామంలో యథేచ్ఛగా తిరుగుతున్నారని ఆరోపించారు.

దౌర్జన్యాలు ఇక సాగవు

మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ అనపర్తిలో వ్యవస్థలతో పని లేకుండా సొంతంగా సెటిల్‌మెంట్లు చేస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. గతంలో దోమాడలో ఒక రియల్టర్‌కు మేలు చేయడం కోసం బడుగుల ఇళ్లు కూల్చిన చరిత్ర అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికే దక్కుతుందన్నారు. ఇటీవల పొట్టకూటి కోసం పెట్రోలు బంకులో పని చేస్తున్న దళిత మహిళలపై దాడి చేసిన తన అనుచరులను వెనకేసుకొచ్చిన చరిత్ర కూడా ఆయనదేనన్నారు. ఈ దౌర్జన్యాలు ఎంతో కాలం సాగవని, సమాధానం చెప్పేరోజు దగ్గరలోనే ఉందన్నారు.

నిందితులను శిక్షించాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ కేసులో ముద్దాయిలకు ఆశ్రయం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిని ఏ1గా చేర్చాలని డిమాండ్ చేశారు. దళితుల ఓట్లతో గెలిచి, వారిని కనీసం మనుషులుగా పరిగణించడం లేదని ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, ఈ కేసుపై పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనపై పట్టు కోల్పోయారన్నారు. అందుకే ఎమ్మెల్యేలందరూ ప్రజలను పీడిస్తున్నారన్నారు. వారికి హనీమూన్ పిరియడ్ అయిపోయిందని, ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. బాధిత మహిళ బుజ్జి కుటుంబానికి తామంతా అండగా ఉంటామని, న్యాయం జరిగేలా పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, అనపర్తి టౌన్ అధ్యక్షులు నల్లమిల్లి మురళీ మోహన బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు కొండేటి భీమేష్, వల్లభశెట్టి సతీష్, నియోజకవర్గ ఎస్సీసెల్ నాయకులు సాంబత్తుల చంటి, రాష్ట్ర యువత సంయుక్త కార్యదర్శి నల్లమిల్లి విజయ్‌రెడ్డి, లీగల్ సెల్ కన్వీనర్ వెలగల లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నర్సరీని సందర్శించిన సజ్జనార్



సజ్జనార్‌కు స్వాగతం పలుకుతున్న పుల్లా ఆంజనేయులు

కడియం: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విశ్వనాథ్ చెన్నప్ప సజ్జనార్ శనివారం కడియపులంకలోని సత్యదేవ నర్సరీని కుటుంబ సమేతంగా సందర్శించారు. నర్సరీ అధినేత పుల్లా ఆంజనేయులు ఆయనకు మొక్కను అందించి ఘనంగా స్వాగతం పలికారు. వివిధ రకాల పండ్లు, పూల మొక్కల గురించి వారికి వివరించారు. కడియం ప్రాంత నర్సరీ రైతాంగం తమ స్వశక్తితో భారీ ఎత్తున నర్సరీలను అభివృద్ధి చేయడాన్ని సజ్జనార్ అభినందించారు.

'రంగరాయ'లో కీచక పర్వం సిగ్గుచేటు



అంగాడ సత్యప్రియ

రాజమహేంద్రవరం రూరల్: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో కీచక పర్వం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంగాడ సత్యప్రియ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజవోలులోని ఆమె నివాసంలో శనివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కూడా మహిళలకు రక్షణ లేకుండా పోయిందంటే పరిస్థితి ఎంత అధ్వానంగా మారిందో అర్థం చేసుకోవచ్చన్నారు. చంద్రబాబు ఆర్భాటంగా ప్రచారం చేసిన శక్తి యాప్ వల్ల ఉపయోగం లేకుండా పోయిందన్నారు. పారా మెడికల్ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన కీచకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాడులు, హత్యలు, లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

వైద్య సేవలను నిర్లక్ష్యం చేయొద్దు

కోరుకొండ: ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. కోరుకొండ, దోసకాయలపల్లి పీహెచ్‌సీలను శనివారం ఆయన సందర్శించారు. ఆయా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలు, సీజనల్ వ్యాధులపై సిబ్బంది సంసిద్ధత, ఐవీఆర్ఎస్ వ్యవస్థ పనితీరును సమీక్షించారు. విధులు సక్రమంగా నిర్వహించాలని, వృత్తితో బాధ్యతగా వ్యవహరించాలని, ఓపీ సేవలు, ల్యాబ్ పరీక్షలను సమాయానికి నిర్వహించాలని ఆదేశించారు. డైలీ అవుట్ పేషెంట్ హాజరుపట్టీని పరిశీలించారు. అనంతరం రోగులతో కొద్దిసేపు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎం.తరణి, జ్ఞానచంద్ర, సీసీ రాజు, ఎంపీహెచ్ఈఓ టీవీ నాగప్రసాద్, మెటర్నరీ అసిస్టెంట్ లలిత కుమారి, ఫార్మసిస్టు రాజేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రాజమహేంద్రవరం రూరల్: లగడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మహిళ.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరంలోని కోటిలింగాల పేటకు చెందిన కొప్పిశెట్టి సురేఖ (35) భర్త సుధాకర్ రెండేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో ఆమె ఇద్దరు పిల్లలతో కలసి జీవిస్తోంది. సురేఖకు కడియాల సత్తిబాబు అనే వ్యక్తి ఫోన్‌లో పరిచయం అయ్యాడు. తనను పెళ్లి చేసుకోకపోతే ఇద్దరం కలసి ఉన్న ఫొటోలను బయటపెట్టి పరువుతీస్తానని బెదిరించాడు. దీంతో మనస్తాపం చెందిన సురేఖ ఈ నెల 9వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యతించింది. ఆమెను రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. సురేఖ తల్లి బొక్కా అనంతలక్ష్మి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ ఎస్సై అప్పలరాజు కేసు నమోదు చేశారు.

బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు రాజ్యలక్ష్మీ పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ శనివారం బాధ్యతలు చేపట్టింది. చైర్‌పర్సన్ ఇన్‌చార్జిగా నున్న బాబూరావు, పర్సన్లుగా ఈదల రాఘవబాబు (మల్లు), సోము గంగాధర్‌తో ఇన్‌చార్జి సంఘ ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ వైస్ ఎంపీపీ గంగిన వీర హనుమంతరావు, నున్న కృష్ణ, మద్దిపాటి వెంకట రామకృష్ణ నూతన కమిటీని అభినందించారు.